epaper : tmedia.net.in

GSTIN-NO:36FDKPS1308P1ZX , Regd. No. 100/20

# టీ-మీడియా

T MEDIA

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : మంగళవారం-సెప్టెంబర్ 12-2023 పేజీలు : 2

టీ-మీడియా ఆన్‌లైన్ సర్వీసెస్

తెలంగాణ ప్రభుత్వం విదేశీ చదువుల కోసం అన్ని కులాల విద్యార్థులకు ఇచ్చే తిరిగి చెల్లింపు లేని రూ. 20 లక్షల పథకం, వివరాలు మరియు ప్రాసెసింగ్ చేయించబడును.

మరిన్ని వివరాలకు సంప్రదించగలరు : 8500515365

# చంద్రబాబు లాయర్ల మరో పిటిషన్

## స్కిల్ డెవలప్‌మెంట్ పరిశీలన అనుమతి కోసం

- న్యాయమూర్తి ఆగ్రహం

**టీ మీడియా, సెప్టెంబర్ 11,విజయవాడ :**

ఏసీబీ కోర్టులో చంద్రబాబు తరపు న్యాయవాదులు మరో పిటిషన్ దాఖలు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు సంబంధించి అన్ని డాక్యుమెంట్స్ పరిశీలన కోసం అనుమతి ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. సీఐడీ కార్యాలయంలో పత్రాల పరిశీలనకు అనుమతి ఇవ్వాలని చంద్రబాబు తరపు న్యాయవాదులు కోరారు. సెక్షన్ 207 సీఆర్‌పీసీ కింద పిటిషన్ దాఖలు చేశారు. అయితే చంద్రబాబు తరపు న్యాయవాదులపై ఏసీబీ కోర్ట్ న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. వరుసగా పిటిషన్లు వేస్తే కోర్టు విధులు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. ఆర్డర్స్ ఇచ్చే సమయానికి మరో కొత్త పిటిషన్ ఎలా వేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టులో పిటిషన్ వేయాలనుకుంటే ఒక ప్రోసీజర్ వుంటుందన్నారు. పిటిషన్ వేయాలనుకుంటే మధ్యాహ్నం 12 గంటల లోపు వేయాలని.. అది నెంబర్ అవుతుందన్నారు. కోర్టు ప్రోసీజర్ ఫాలో కాకుంటే ఎలా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. వేరే కేసులు పెండింగ్‌లో వుంటున్నాయని జడ్జి అన్నారు.

### కుటుంబ సభ్యులతో చంద్రబాబు ములాఖత్ రద్దు..

**రాజమండ్రి :** రాజమండ్రి సెంట్రల్ జైలులో కుటుంబ సభ్యులతో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ములాఖత్ రద్దయ్యింది. దీనికి బదులుగా రేపు ఆయన ఫ్యామిలీని కలవనున్నారు. తొలుత ఈ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, నారా భువనేశ్వరి, బ్రాహ్మణి టీడీపీ అధినేతను కలుస్తారని భావించారు. ఈ మేరకు జైలు అధికారులకు కూడా సమాచారం వచ్చినట్లుగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించి జైలు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే భువనేశ్వరి, బ్రాహ్మణి ఈ రోజు 3 గంటల వరకు రాలేని పరిస్థితుల్లో కుటుంబ సభ్యుల ములాఖత్ రేపు మధ్యాహ్నానికి వాయిదా పడిందని తెలుస్తోంది. కాగా నారా లోకేశ్ తన బస్సులో ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. అరెస్ట్ తర్వాత పరిణామాలపై ఆయన నేతలతో చర్చిస్తున్నారు.

### హౌస్ అరెస్ట్ అవసరం లేదు : ఏపీ సీఐడీ

**విజయవాడ :** టీడీపీ అధినేత చంద్రబాబుకు స్కిల్ డెవలప్ మెంట్ స్కాం కేసులో ఏసీబీ కోర్టు రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. ఆయన న్యాయవాదులు నిన్న హౌస్ అరెస్ట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఏపీ సీఐడీ కౌంటర్ దాఖలు చేసింది. అరెస్ట్



సమయంలో చంద్రబాబు ఆరోగ్యంగానే ఉన్నారని, ఆయనకు హౌస్ అరెస్ట్ అవసరంలేదని స్పష్టం చేసింది. చంద్రబాబుకు ఇంట్లో కంటే జైల్లోనే భద్రత ఉంటుందని వెల్లడించింది. సీఆర్పీసీలో హౌస్ రిమాండ్ గురించి ఎలాంటి ప్రస్తావన లేదని పేర్కొంది. బెయిల్ లభించని కారణంగానే హౌస్ రిమాండ్ అంశాన్ని తెరపైకి తెచ్చారని ఏపీ సీఐడీ తన కౌంటర్‌లో ఆరోపించింది.

# పర్యావరణం, పచ్చదనం లేని సమాజాన్ని ఊహించలేం

- ముఖ్యమంత్రి కేసీఆర్



**టి మీడియా ,సెప్టెంబర్ 11, హైదరాబాద్:**

అడవులు, పర్యావరణం, పచ్చదనం లేని సమాజాన్ని మనం ఊహించలేమని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. అందుకే తెలంగాణఏర్పాటైన తొలినాళ్లలోనే సమతుల్య పర్యావరణం కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని చెప్పారు. ఇప్పుడు దశాబ్ది తెలంగాణలో ఆ సంకల్పం ఫలితాలు చూస్తున్నామని వెల్లడించారు. అడవుల పునరుద్ధరణ, పచ్చదనం పెంపు కోసం ప్రభుత్వం సంకల్పించిన తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి అన్ని వర్గాల మద్దతు లభించటంతో నేడు మనం అద్భుతమైన ఫలితాలను చూస్తున్నామని తెలిపారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అడవుల రక్షణ కోసం ఆత్మార్పణం చేసిన అమరులకు సీఎం కేసీఆర్ శ్రద్ధాంజలి ఘటించారు. హైదరాబాద్ లాంటి కాంక్రీట్ కీకారణ్యంలో కూడా ఊహించనంత పచ్చదనం పెరగడంతో అంతర్జాతీయ ఉద్యానవన ఉత్పత్తిదారుల సంఘం అందించే వరల్డ్ గ్రీన్ సిటీ అవార్డ్- 2022 హైదరాబాద్‌కు దక్కిందన్నారు. అభివద్ధి ఎంత సాధించినా, సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా ప్రకృతి పరిరక్షణ మన ప్రాథమిక ధ్యేయమని స్పష్టం చేశారు. పర్యావరణ పరంగా తగిన రక్షణ చర్యలు చేపట్టని ఫలితమే గ్లోబల్ వార్మింగ్ రూపంలో చూస్తున్నామని వెల్లడించారు. అందుకే మనతోపాటు, భవిష్యత్ తరాలు కూడా ఈ పుడమిపై జీవించే హక్కును కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఈ దిశగా అటవీ శాఖ చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయమని చెప్పారు.హరిత తెలంగాణ కోసం మన లక్షిత పచ్చదనం 33 శాతం సాధించేదాకా కలిసికట్టుగా పనిచేద్దామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఇదే సమయంలో అటవీ రక్షణ కోసం కార్యదీక్షతో పనిచేసిన అధికారులు, సిబ్బంది 22 మంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని, వారి అంకితభావం మనందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. అడవుల రక్షణ కోసం ఆత్మార్పణం చేసిన అమరులకు హదయ పూర్వక శ్రద్ధాంజలి ఘటించారు. వారి ఆశయాలు సజీవంగా ఉండాలంటే ప్రభుత్వం అమలు చేస్తున్న 'జంగల్ బచావో్-జంగల్ బడావో' నినాదాన్ని చిత్తశుద్ధితో మనం అమలు చేయాలన్నారు. సమాజంలోని ప్రతీ ఒక్కరూ ఆ దిశగా ప్రతిజ్ఞ తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

# సౌదీ యువరాజుతో ప్రధాని మోడీ భేటీ

**టి మీడియా ,సెప్టెంబర్ 11, న్యూఢిల్లీ :**




భారత్ పర్యటనలో ఉన్న సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్‌తో సోమవారం ప్రధాని మోడీ భేటీ అయ్యారు. వాణిజ్యం, ఆర్థికం, రక్షణ రంగాలతో పాటు సాంస్కృతిక సహకారం వంటి ప్రధాన అంశాలపై ఇరువురు నేతలు చర్చలు జరిపారు. నేడు ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో వ్యూహాత్మక భాగస్వామ్య మండలి మొదటి సమావేశానికి ఇరువురు నేతలు అధ్యక్షత వహించారు. 2019లో రియాద్‌లో భారత్, సౌదీ అరేబియాల మధ్య జరిగిన సమావేశంలో ద్వైపాక్షిక ఒప్పందంపై ఇరు దేశాలు సంతకం చేసిన సంగతి తెలిసిందే. సౌదీ అరేబియా భారత్‌ను అత్యంత సన్నిహిత, వ్యూహాత్మక భాగస్వాములలో ఒకటిగా భావిస్తుందని ప్రధాని పేర్కొన్నారు. ఆ ప్రాంత, ప్రపంచ సంక్షేమం, స్థిరత్వం కోసం ఇరుదేశాల భాగస్వామ్యం కీలకమని అన్నారు. నేటి సమావేశం తమ బంధానికి కొత్త కోణాన్ని ఇచ్చిందని, ప్రజల కోసం పనిచేయడానికి స్ఫూర్తినిచ్చిందని అన్నారు. సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ భారత్‌లో పర్యటించడం ఇది రెండోసారి.

# ఇక దేశ సమస్యలపై దృష్టి పెట్టండి

- కాంగ్రెస్ అధ్యక్షుడుమల్లికార్జున్ ఖర్గే

**టీ మీడియా, సెప్టెంబర్ 11,న్యూఢిల్లీ :**



కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోమవారం మోడీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జి20 సమావేశాలు ముగిశాయని, ఇప్పుడు మోడీ ప్రభుత్వం దేశసమస్యలపై దష్టి పెట్టాలని అన్నారు. ప్రధాని మోడీ వాస్తవాలను దాచడానికి తీవ్రంగా యత్నిస్తున్నారని, అయితే ప్రజలు నిజాలను తెలుసుకోవాలని కోరుకుంటున్నారని అన్నారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేశారు.' జి 20 సమావేశాలు ముగిసాయి. ఇప్పుడు మోడీ ప్రభుత్వం దేశ సమస్యలపై దఅష్టి పెట్టాలి. ఆగస్టులో సాధారణ ప్లేట్ ఫుడ్ ధర 24 శాతం పెరిగింది నిరుద్యోగం 8 శాతానికి చేరుకుంది. యువత భవిష్యత్తు అంధకారమైంది" అని పేర్కొన్నారు. కుంభకోణాలు .. మోడీ ప్రభుత్వ దుర్వినియోగం అవినీతికి దారితీసింది. కాగ్ అనేక నివేదికల్లో బిజెపిని బట్టబయలు చేసింది. జమ్మూకశ్మీర్‌లో రూ.13000 కోట్ల జల్‌జీవన్ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ స్కామ్‌లో అవినీతిని బయటపెట్టినందుకు దళిత ఐఎఎస్ అధికారిని వేధించారని పేర్కొన్నారు. ప్రధాని ప్రాణ స్నేహితుడి దోపిడీ ఇటీవల మళ్లీ తెరపైకి వచ్చిందన్నారు. 2019 ఎన్నికలకు ముందు ఆర్‌బిఐ ఖజానా నుంచి రూ.3 లక్షల కోట్లను మోడీ ప్రభుత్వానికి బదిలీ చేయాలన్న ప్రభుత్వ ఒత్తిడిని ఆర్‌బిఐ మాజీ డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య వ్యతిరేకించారు. దీంతో ఈ బండారం బయటపడిందని చెప్పారు.

"మణిపూర్‌లో మళ్లీ హింస జరిగింది. హిమాచల్‌ప్రదేశ్‌లో విపత్తు సంభవించింది. అయితే అహంకారపూరిత మోడీ ప్రభుత్వం దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించకుండా తప్పించుకుంటుంది" అని ఖర్గే ధ్వజమెత్తారు. వీటన్నింటి మధ్య మోడీ వాస్తవాలను కప్పిపుచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కానీ కానీ ప్రజలు వాస్తవాన్ని వినాలని, చూడాలని కోరుకుంటున్నారని అన్నారు. 2024లో మోడీ ప్రభుత్వ నిష్క్రమణకు ప్రజలు మార్గం సుగమం చేయడం ప్రారంభించారని మల్లికార్జున్ ఖర్గే అన్నారు.



# కలిసి పోరాడుదాం ధైర్యంగా ఉండండి

- లోకేశ్‌కు పవన్ ఫోన్

**టీ మీడియా ,సెప్టెంబర్ 11 ,అమరావతి :**

జగన్ నియంత పాలనపై కలిసి పోరాడుదామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌తో జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. స్కిల్ స్కామ్ కేసులో టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు, రిమాండ్ కు తరలించిన నేపథ్యంలో ... పవన్ కల్యాణ్ ఫోన్లో లోకేష్ ను పరామర్శించారు. ప్రజల కోసం పోరాడుతున్న ప్రతిపక్ష నేతని అక్రమ కేసుల్లో అరెస్ట్ చేయించి వేధించడం జగన్‌కు అలవాటుగా మారిందని అన్నారు. నియంతలా జగన్ సాగిస్తున్న అరాచకాలపై అంతా కలిసి పోరాడుదామని, ధైర్యంగా ఉండాలని నారా లోకేష్ కు పవన్ చెప్పారు. యువగళం పాదయాత్రకు కొన్నిరోజులపాటు నారా లోకేశ్ విరామం ఇచ్చారు. శుక్రవారం నాటికి కోనసీమ జిల్లా పొదలాడకు లోకేశ్ చేరుకున్నారు. ఇక చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో రిమాండ్ విధించడంతో పరిస్థితులు చక్కబడేవరకు పాదయాత్రకు తాత్కాలికంగా బ్రేక్ ఇస్తున్నట్టు టిడిపి శ్రేణులు తెలిపారు. పరిస్థితులు చక్కబడ్డాక లోకేష్ మళ్లీ పాదయాత్రను ప్రారంభిస్తారని వెల్లడించారు.

# ఎపిలో టిడిపి బంద్, పలుచోట్ల ఉద్రిక్తత

- వెల్లువెత్తిన నిరసనలు

**టీ మీడయా ,సెప్టెంబర్ 11,అమరావతి :**



రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట స్కాం కేసులో ఎసిబి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన నేపథ్యంలో నేడు రాష్ట్ర బంద్‌కు టిడిపి పిలుపునిచ్చింది. చంద్రబాబు అరెస్టయినప్పటి నుండీ గత 2 రోజులుగా టిడిపి ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి శ్రేణులు నిరసనలను హోరెత్తించారు. అక్కడక్కడ ఉద్రిక్తతలు-అరెస్టులు-వాదోపవాదాలు-ఘర్షణలు చోటుచేసుకున్నాయి. టిడిపి పిలుపుమేరకు ... నేటి రాష్ట్ర బంద్‌కు జనసేన, సిపిఐ, లోక్ సత్తా, జైభీమ్ పార్టీలు సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. ముఖ్యమంత్రి జగన్‌కు, వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో ఆందోళనకారులు హోరెత్తిస్తున్నారు. టిడిపి కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ లకు తరలిస్తున్నారు. పలు చోట్ల టిడిపి శ్రేణులపై పోలీసులు చేయి చేసుకున్న వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు ఆందోళనకారులు రోడ్లపై టైర్లను కాల్చేస్తు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పలు చోట్ల విద్యా సంస్థలు, షాపులను స్వచ్ఛందంగా మూసివేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు 144 సెక్షన్ ను అమలు చేస్తున్నారు. ఎక్కడికక్కడ పోలీసులు భారీగా మోహరించారు. ఒంగోలు నగరంలో టిడిపి ఆధ్వర్యంలో భారీగా శాంతియుత ర్యాలీ నిర్వహించిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు.

# పవర్ పాయింట్ సృష్టికర్త అస్టిన్ మృతి

**టి మీడియా ,సెప్టెంబర్ 11, న్యూయార్క్:**



విశేష ప్రాచుర్యం పొందిన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ సహసృష్టికర్త డెన్నిస్ అస్టిన్ (76) ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్న అస్టిన్ కాలిఫోర్నియాలో మరణించారని ఆయన కుమారుడు మైఖేల్ అస్టిన్ మీడియాకు వెల్లడించారు. ఎంఐటిలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన అస్టిన్ ఫోర్‌థాట్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేశారు. టెక్నాలజీ రంగంలో విశేష సేవలందించిన అస్టిన్ పవర్‌పాయిట్ కో డెవలపర్‌గా గుర్తింపు పొందారు. ఫోర్‌థాట్‌కు చెందిన రాబర్ట్ గస్కిన్స్‌తో కలిసి అస్టిన్ పవర్‌పాయింట్‌పై పనిచేశారు.

ఫోర్‌థాట్ సంస్థను తరువాత మైక్రోసాఫ్ట్ కొనుగోలు చేసింది. 1985 నుంచి 1996లో రిటైరయ్యే వరకూ పవర్‌పాయింట్ ప్రైమరీ డెవలపర్‌గా అస్టిన్ సేవలందించారు. 1993 నాటికి పవర్‌పాయింట్ ఏకంగా పది కోట్ల సేల్స్ నమోదు చేసింది.ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పవర్‌పాయింట్‌ను సులభంగా నిర్వహించేలా అస్టిన్ సరళతరం చేశారు. కేవలం స్లైడ్స్ కాకుండా ప్రెజెంటేషన్స్‌ను పకడ్బందీగా ఇచ్చేలా పవర్‌పాయింట్ ప్రెజేం టేషన్‌ను అస్టిన్ డెవలప్ చేశారు. అస్టిన్ పవర్‌పాయింట్‌ను డిజైన్ చేయకుంటే దాని గురించి ఏ ఒక్కరూ వినిఉండేవారు కాదని, అది ఇంతగా ప్రాచుర్యం పొందేదని కాదని తన పుస్తకంలో గస్కిన్స్ రాసుకొచ్చారు. పవర్‌పాయింట్‌పై ప్రతిరోజూ 5 కోట్ల ప్రెజంటేషన్స్ క్రియేట్ అవుతున్నాయి. కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు, బిజినెస్ స్కూల్స్, ప్రొఫెసర్లు, మిలటరీ జనరల్స్ ఈ సాఫ్ట్‌వేర్‌ను విరివిగా వాడుతున్నారు.



# హౌస్ రిమాండ్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

- మంగళవారం ఉత్తర్వులు

**టి మీడియా ,సెప్టెంబర్ 11, విజయవాడ :**

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు హౌస్ రిమాండ్ పిటిషన్‌పై విచారణను ఏసీబీ కోర్టు మంగళవారం వాయిదా వేసింది. వాదనలు విన్న ఏసీబీ కోర్టు మంగళవారం ఉత్తర్వులు ఇస్తామని తెలిపింది. హౌస్ రిమాండ్ పిటిషన్‌పై సీఐడీ తరఫున ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, చంద్రబాబు తరఫున సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. లంచ్ బ్రేక్‌కు ముందు, లంచ్ బ్రేక్ అనంతరం గం.4.30 తర్వాత, తిరిగి సాయంత్రం ఆరు తర్వాత... మూడు విడతలుగా వాదనలు జరిగాయి.

చంద్రబాబుకు ఇంట్లో కంటే జైల్లోనే సెక్యూరిటీ ఉంటుందని, హౌస్ రిమాండ్‌లో ఉంటే సాక్ష్యాలు తారుమారు చేస్తారని, జైల్లో కూడా పూర్తిస్థాయి సెక్యూరిటీని కల్పించామంటూ సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. అత్యవసరమైతే వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

మరోవైపు, చంద్రబాబుకు జైల్లో ప్రమాదం ఉందని, ఆయనకు ఇప్పటి వరకు ఎన్ఎస్జీ భద్రత ఉందని, కానీ ఇప్పుడు జైల్లో కల్పించిన భద్రతపై అనుమానాలు ఉన్నాయని సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న అనంతరం రాజమండ్రి కేంద్రకారాగారంలో భద్రతపై మరింత వివరణ కావాలని చంద్రబాబు తరఫు న్యాయవాది లూథ్రాను ఏసీబీ కోర్టు న్యాయమూర్తి కోరారు. సాయంత్రం ఇరువైపుల వాదనలు విన్న ఏసీబీ న్యాయమూర్తి విచారణను రేపటికి వాయిదా వేసి, ఆ తర్వాత తీర్పు ఇస్తామని తెలిపింది. మరోవైపు, ఇరువర్గాల న్యాయవాదులను రేపు కోర్టుకు రావాలని న్యాయమూర్తి ఆదేశించారు.



# రాహుల్ తన పేరును మార్చుకోవాలి

- అసోం ముఖ్యమంత్రి

**టీ మీడయా ,సెప్టెంబర్ 11,గువహటి :**

కాంగ్రెస్ మాజీ చీఫ్ రాహుల్ గాంధీ తన పేరును మార్చుకోవాలని అసోం ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గువహటిలోని బిజెపి మహిళా మోర్చా కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ కాంగ్రెస్‌పై ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు యత్నిస్తోందని అన్నారు. గాంధీ కుటుంబం సర్దార్ ఆఫ్ డూప్లికేట్ అని, వారు చాలా కుంభకోణాలకు పాల్పడ్డారని ఆరోపిం చారు. గాంధీ అనే బిరుదుతోనే వారి మొదటి కుంభకోణం ప్రారం భ మైందని,వారు కుటుంబం కోసం మాత్రమే పనిచేస్తూ.. దేశాన్ని విచ్ఛి న్నం చేసేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. గాంధీ బిరుదును ఇవ్వా లని తాను రాహుల్‌గాంధీని అభ్యర్థిస్తున్నానని అసోం ముఖ్య మంత్రి హిమంత శర్మ పేర్కొన్నారు. 25ఏళ్ల, 50 ఏళ్ల స్వాతంత్ర్య దినో త్సవ వేడుకలను కాంగ్రెస్ జరపలేదని అన్నారు. కానీ మోడీ 75 ఏళ్ల స్వా తంత్ర్య వేడుకలను ఘనంగా జరుపుతున్నారని, దీంతో ప్రతి ఒక్కం్హా భారతీయులమని గర్వంగా భావించేలా చేస్తున్నారని అన్నారు. భారత్‌ను విశ్వగురువుగా నిలిపేందుకు ప్రధాని మోడీ కృషిచేస్తున్నారని అన్నారు.

# రాగి జావకు పైసా ఇవ్వని ప్రభుత్వం

- కార్మికులే సమకూర్చుకుంటున్న పరిస్థితి

**టీ మీడియా ,సెప్టెంబర్ 11,కాకినాడ ప్రతినిధి :**

జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి పోషక విలువలు గల రాగిజావను పంపిణీ చేస్తున్నారు. వారంలో మూడు రోజులపాటు మంగళ, గురు, శనివారాల్లో దీన్ని అందిస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉన్నా వండి, వడ్డించి, పంపిణీ చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు మాత్రం పైసా విదల్చట్లేదు. పెరిగిన ధరలతో పోల్చుకుంటే మెనూ బిల్లులు సరిపోని కారణంగా ఇప్పటికే తీవ్రంగా సతమతమవుతున్న కార్మికులపై రాగిజావ మరో ఇబ్బందిని తెచ్చి పెట్టింది.కాకినాడ జిల్లాలో 1,250 పాఠశాలల్లో 1,46,849 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ప్రైమరీ విద్యార్థులు 42,960 మంది, యుపి విద్యార్థులు 12,403, హైస్కూలు విద్యార్థులు 91,486 మంది ఉన్నారు. వీరిలో 1,03,138 మంది మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. రాగి జావ మాత్రం 1.46 లక్షల మందికీ అందజేస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. జిల్లాలో కాకినాడ అర్బన్ సహా 8 మండలాల్లో 504 పాఠశాలల్లో సుమారు 68 వేల మందికి అక్షయ పాత్ర, అల్లూరి సీతారామరాజు స్వచ్ఛంద సంస్థల నుంచి జావను వండి



తెలుస్తున్నారు. మిగిలిన 78 వేల మందికి జిల్లాలో ఉన్న కార్మికులు పాఠశాలల్లోనే వండుతున్నారు. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, 10 గ్రాముల బెల్లం పొడి కలిపి ఉదయం 8:45 గంటలకు ఇవ్వాలని గైడెలెన్స్ జారీ చేశారు. ఉదయమే జావ తయారు చేసి పిల్లలకు ఇస్తున్నారు. గంట ముందే ఉపాధ్యాయులు పాఠశాలలకు చేరుకుని ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేస్తున్నారు.

సరిపోని నిధులుజావ తయారు చేస్తున్న కార్మికులకు అదనంగా పైసా కూడా ఇవ్వడం లేదు. గ్యాస్, నిత్యావసరాలు ధరలు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వం మెనూ కింద ఇచ్చే నిధులు ఏమాత్రం సరిపోవడం లేదని కార్మికులు అనేకేళ్లుగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థికి రూ.5.88 పైసలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థికి రూ.8.57 చొప్పున మాత్రమే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. రైస్, గుడ్లు, చిక్కీలు, రాగి పిండి, బెల్లం సరఫరా చేస్తున్నా కూరగాయలు, ఆయిల్, కందిపప్పు, తదితర వస్తువులన్నీ ప్రభుత్వం ఇస్తున్నా కొద్ది కుకింగ్ చార్జీలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుందని గగ్గోలు పెడుతున్నారు. గ్యాస్ ధర భారీగా పెరగ్గా, కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు అకాశాన్నంటాయి. కొత్తగా రాగి జావ తయారీకి వాడే గ్యాస్ అదనపు భారమవుతుందనే ఆందోళన వ్యక్తం అవుతుంది. 100 మంది విద్యార్థులకు జావ తయారీకు రూ.40 గ్యాస్ ఖర్చు అవుతుందని కార్మికులు తెలిపారు. నెలలో 15 రోజుల పాటు రాగిజావను కాయాల్సి వస్తుంది. ఫలితంగా గ్యాస్ త్వరగా అయిపోతుందని వారంటున్నారు. మరో వైపు ప్రభుత్వం దీని తయారీకి వంట పాత్రలు ఇస్తామని చెప్పినా నేటికీ ఇవ్వలేదు. దీంతో కార్మికులే వాటిని సమకూర్చుకుంటున్న పరిస్థితి ఉంది. గ్యాస్, వంట పాత్రల ఖర్చుతో బాటు శ్రమ కూడా పెరిగిందని తమకు మెనూ నిధులు, వేతనాలు పెంచాలని కోరుతున్నారు.

# గవర్నర్‌తో టిడిపి బృందం భేటి

- చంద్రబాబు అరెస్ట్ రాజకీయ కుట్రే

**టి మీడియా ,సెప్టెంబర్ 11విశాఖపట్నం :**



ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుపై ఆ పార్టీ నేతలు సోమవారం ఉదయం గవర్నర్ ను కలిశారు. పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నేతత్వంలో గంటా శ్రీనివాస రావు, గండి బాబ్జి, చిరంజీవిరావు, రామారావు, రాజబాబు తదితరులు విశాఖ పోర్ట్ గెస్ట్ హౌస్ కు వెళ్లారు. అక్కడ గవర్నర్ అబ్దుల్ నజీర్ ను కలిశారు. ఆదివారం ఉదయమే గవర్నర్ ను కలిసేందుకు టీడీపీ నేతల ప్రయత్నించగా గవర్నర్ అపాయింట్ మెంట్ ను రద్దు చేశారు. దీంతో టీడీపీ నేతలు సాయంత్రం మరోమారు గవర్నర్ అపాయింట్ మెంట్ కోరగా సోమవారం ఉదయం అపాయింట్ మెంట్ ఇచ్చారు.గవర్నర్ ను కలిసి బయటకు వచ్చిన తర్వాత అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడుతూ, . చంద్రబాబు అరెస్టుపై ముందస్తు సమాచారం ఇవ్వలేదని గవర్నర్ చెప్పారన్నారు. రాష్ట్రంలో పరిణామాలను గమనిస్తున్నట్లు వివరించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో టీడీపీకి పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. ఓ శాడిస్ట్, సైకో కూడా ఇలాంటి దుర్మార్గపు అరెస్టుకు ఆదేశించరని చెప్పారు. యువనేత లోకేశ్ పాదయాత్రను ప్రజలు విశేషంగా ఆదరించడం చూసి వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని వైసీపీ నేతలకు అర్థమైందన్నారు. ఐ ప్యాక్ టీమ్ జరిపిన సర్వేలో అధికార పార్టీ పరిస్థితి ప్రమాదకరంగా ఉందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలిసి పోటీచేస్తే వైసీపీ చిరునామా గల్లంతేనని తేలిందని అచ్చెన్నాయుడు చెప్పారు. దీంతో ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగిందని విమర్శించారు.

## వన్డే ప్రపంచకప్ న్యూజిలాండ్ కెప్టెన్‌గా విలియమ్సన్

**టి మీడియా ,సెప్టెంబర్ 11, క్రైస్ట్‌చర్చ్:**



భారత్ వేదికగా అక్టోబర్‌లో జరిగే ఐసిసి వన్డే ప్రపంచకప్ న్యూజిలాండ్ కెప్టెన్‌గా సీనియర్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ ఎంపికయ్యాడు. న్యూజిలాండ్ క్రికెట్‌బోర్డు వన్డే ప్రపంచకప్‌కు ప్రకటించిన 15మందితో కూడిన జట్టును సోమవారం వెల్లడించింది. సెంట్రల్ కాంట్రాక్ట్ లేని జిమ్మీ నీషమ్, ట్రెంట్ బౌల్ట్ ఈ స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నారు. యంగ్ ఓపెనర్ ఫిన్ అలెన్‌పై నమ్మకం ఉంచిన సెలెక్టర్లు.. కైల్ జేమీసన్, ఆడం మిల్నేలను దూరం పెట్టింది. అలాగే స్పిన్ ఆల్‌రౌండర్ మైఖేల్ బ్రాస్‌వెల్ బోర్డు ప్రకటించిన 15మంది జట్టులో చోటు దక్కలేదు. మోకాలి గాయం నుంచి కోలుకున్న విలియమ్సన్ మరోసారి జట్టును నడిపించనున్నాడు. అతడితో పాటు టిమ్ సౌదీకి ఇది నాల్గో ప్రపంచకప్.జట్టు: విలియమ్సన్(కెప్టెన్), చాప్మన్, కాన్వే, లాథమ్(వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), మిచెల్, నీషమ్, ఫిలిఫ్స్, రవీంద్ర, సాంట్నర్, సోధీ, యంగ్, బౌల్ట్, సౌథీ, ఫెర్గూసన్, హెన్రీ.

# నీటి శుద్ధి కేంద్రానికి గది

- నిర్మాణఖర్చు భరీ ఇస్తా: నరేందర్ రెడ్డి

**టి మీడియా ,సెప్టెంబర్ 11, ఓదెల:**

పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలం పోత్కపల్లి గ్రామంలో బాలవికాస నీటి శుద్ధీకరణ పథకంలో భాగంగా పోత్కపల్లి గ్రామంలో నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి సంస్థ డైరెక్టర్ మోహన్ రెడ్డి ని ఆహ్వానించిన గ్రామ సర్పంచ్, ఆళ్ల రాజిరెడ్డి, ఉపసర్పంచ్ వంగ శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ శుద్ధి చేసిన నీటినే వాడాలని, గ్రామంలో ఉన్న నీటిలో, ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉన్న కారణంగా, ప్రతి ఒక్కరు శుద్ధి చేసిన




నీటిని తాగాలని సూచించారు, నీటి శుద్ధి కేంద్రానికి కావలసిన గది నిర్మాణానికి పూర్తి ఖర్చు, భరిస్తానని, నరేందర్ రెడ్డి, ముందుకు వచ్చారు, వారి భార్య ఇటీవల మరణించగా తన జ్ఞాపకార్థకంగా షెడ్డు నిర్మించడం జరుగుతుందని తెలిపారు, అనంతరం నీటి శుద్ధి కేంద్రం కమిటీ ని ఏర్పాటు చేశారు, అధ్యక్షులుగా ఆళ్ల సుమన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా, నగునూరి వనజ, కార్యదర్శి, మాచర్ల సాయిలు, ఉప కార్యదర్శిగా, కొండపాక చైతన్య, కోశాధికారిగా, రెడ్డి లావణ్య, డైరెక్టర్లుగా, వంగ మహేష్, పాల ప్రియాంక, పిట్టల లక్ష్మణ్, సిరిసేటి రవీందర్, పచ్చిక ఉమా, అక్రమ్‌ను ఏన్నుకోవడం జరిగింది.

## తెలంగాణ జాతీయ సమైక్యతా దినం ఏర్పాట్లపై ప్రభుత్వం ఆదేశాలు

**టి మీడియా ,సెప్టెంబర్ 11, హైదరాబాద్ :**

హైదరాబాద్ స్టేట్ భారత యూనియన్‌లో కలిసిన సెప్టెంబర్ 17వ తేదీని 'తెలంగాణ జాతీయ సమైక్యతా దినంగా పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించే వేడుకల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొని జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. జిల్లా కేంద్రాల్లో కూడా అదే రోజు ఉదయం 9 గంటలకు ఈ వేడుకలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ చీఫ్‌విప్‌లు, విప్‌లు జాతీయ జెండాలను ఎగురవేయనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**ఏ జిల్లాలో.. ఎవరంటే..**

ఆదిలాబాద్-ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
భద్రాద్రి కొత్తగూడెం-ప్రభుత్వ విప్ రేగా కాంతారావు
జగిత్యాల-మంత్రి కొప్పుల ఈశ్వర్
భూపాలపల్లి-ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి
జనగామ-మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
జోగులాంబ గద్వాల-డిప్యూటీ స్పీకర్ పద్మారావు
కామారెడ్డి-స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి
ఖమ్మం-మంత్రి పువ్వాడ అజయ్
కరీంనగర్-మంత్రి గంగుల కమలాకర్
ఆసిఫాబాద్-ఎమ్మెల్యే సుంకరి రాజు
మహబూబ్‌నగర్-మంత్రి శ్రీనివాస్ గౌడ్
మహబూబాబాద్-మంత్రి సత్యవతి రాథోడ్
మంచిర్యాల-ప్రభుత్వ విప్ బాల్క సుమన్
మెదక్-మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
మేడ్చల్-మంత్రి మల్లారెడ్డి
ములుగు-ప్రభుత్వ విప్ ప్రభాకర్ రావు
నాగర్‌కర్నూల్-ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు
నల్లగొండ-మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
నారాయణపేట-మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి
నిర్మల్-మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి
నిజామాబాద్-మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
పెద్దపల్లి-ప్రభుత్వ చీఫ్‌విప్ భానుప్రసాద్ రావు
రాజన్న సిరిసిల్ల-మంత్రి కేటీఆర్
రంగారెడ్డి-మంత్రి సబితా ఇంద్రారెడ్డి
సంగారెడ్డి-మంత్రి మహమూద్ అలీ
సిద్దిపేట-మంత్రి హరీశ్‌రావు
సూర్యాపేట్-మంత్రి జగదీశ్ రెడ్డి
వికారాబాద్-మంత్రి మహేందర్ రెడ్డి
వనపర్తి-మంత్రి నిరంజన్ రెడ్డి
హనుమకొండ-ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్
వరంగల్-డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్
యాదాద్రి భువనగిరి-ప్రభుత్వ విప్ సునీతా మహేందర్ రెడ్డి.

## ఈడీ నోటీసులపై మండిపడిన టిఎంసి నేత

**టీ మీడయా ,సెప్టెంబర్ 11,కోల్‌కతా :**



ప్రతిపక్ష కూటమి ఇండియా కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం రోజునే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఈడి) నోటీసులివ్వడంపై తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ మండిపడ్డారు. ఇండియాను చూసి ప్రధాని మోడీ భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. స్కూల్ రిక్రూట్‌మెంట్ స్కాం కేసులో ఈ నెల 13న విచారణకు హాజరుకావాలని ఈడి అభిషేక్ బెనర్జీకి సమన్లు జారీ చేసింది. అయితే అదే రోజున ప్రతిపక్ష కూటమి ఇండియా కో ఆర్డినేషన్ కమిటీ ఢిల్లీలో సమావేశం కానుందని అభిషేక్ బెనర్జీ పేర్కొన్నారు. ఇండియా కో ఆర్డినేషన్‌లో సభ్యుడిగా తాను ఆ సమావేశానికి హాజరుకావాల్సి ఉందని అన్నారు.ఇండియా కూటమి సమన్వయ కమిటీ మొదటి సమావేశం సెప్టెంబర్ 13న ఢిల్లీలో జరగనుంది. ఆ కమిటీలో నేను సభ్యుడిని. కానీ అదే రోజున విచారణకు హాజరుకావాలని ఈడి నోటీసులిచ్చింది. 56 అంగుళాల ఛాతీ మోడల్ (ప్రధాని) పిరికితనం చూసి ఆశ్చర్యపోకుండా ఉండలేరు " అని అభిషేక్ బెనర్జీ ఎక్స్‌లో ట్వీట్ చేశారు.రిక్రూట్ మెంట్ స్కాంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు సమన్లు జారీ చేయడం ఇదే మొదటిసారి కాదు. గతంలో ఈడి, సిబిఐలు రెండు సమన్లు జారీ చేశాయి. ఈ కుంభకోణంలో చట్ట విరుద్ధమైన మార్గాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు మరియు బోధనేతర సిబ్బంది నియామకాలు జరిగినట్లు ఈడి వాదిస్తోంది. ఈ కేసుకు సంబంధించి రాష్ట్ర మాజీ విద్యా మంత్రి పార్థ ఛటర్జీ సహా పలువురు అధికారులు జైలులో ఉన్న సంగతి తెలిసిందే.

# కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే

- ఆమె వల్లే కేసీఆర్ ఎంపీ అయ్యారన్న రేవంత్ రెడ్డి

**టి మీడియా ,సెప్టెంబర్ 11, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్ రెడ్డి, ఆమె అనుచరులకు కాంగ్రెస్ కండువా కప్పి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మాణిక్ రావు థాక్రే పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో తాను స్వతంత్ర ఎమ్మెల్సీగా గెలిచేందుకు సీతా దయాకర్ రెడ్డి మద్దతు తెలిపారని అన్నారు. తన రాజకీయ ఎదుగుదలలో ఆమె అండగా నిలుస్తూ వచ్చారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో టీడీపీతో టీఆర్ఎస్ పొత్తు పెట్టుకున్నప్పుడు కేసీఆర్ ను ఆమె ఎంపీగా గెలిపించారని చెప్పారు.పాలమూరుకు కేసీఆర్ చేసింది ఏమీ లేదని రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి కాకముందే.. దాన్ని ప్రారంభిస్తున్నామంటూ గొప్పలు చెబుతున్నారని అన్నారు. 31 పంపుల్లో ఒకే ఒక్క పంపుతోనే ప్రాజెక్టును ప్రారంభిస్తున్నారని విమర్శించారు.పాలమూరు జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాలన్నింటిలో కాంగ్రెస్ ను గెలిపించాలని ఆయన అన్నారు. సీతక్కను రాజకీయంగా తమ పార్టీ అన్ని రకాలుగా ఆదుకుంటుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో





గెలిచి, కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.తెలంగాణకు కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఖర్గే, ఇతర జాతీయ నాయకులు వస్తున్నారని చెప్పారు. సెప్టెంబరు 17న తుక్కుగూడ రాజీవ్ గాంధీ ప్రాంగణంలో జరిగే విజయ భేరికి ప్రజలు భారీగా రావాలని పిలుపునిచ్చారు.




## భవన నిర్మాణ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం

**టి మీడియా, సెప్టెంబర్ 11, ఓదెల:**

పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పోత్కపల్లి గ్రామంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం,ఓదెల మండల కోశాధికారి వేముల రమేష్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కామల్ల ఐలన్న మరియు రాష్ట్ర కార్యదర్శి పంకేర్ల కుమారస్వామి హాజరయ్యారు,వ్యవస్థాపక అధ్యక్షుడు ఐలన్న మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు తప్పనిసరిగా లేబర్ కార్డు ఉండాలని దాని ఉపయోగాలు తెలిపారు,సంఘం లో అందరం కలిసికట్టుగా ఉండటం వల్లే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు.బి యెన్ ఆర్ కె ఎస్ నుంచి పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి నీ పదవి నుండి మరియు సంఘం నుండి తొలగించి జిల్లా నూతన జిల్లా అధ్యక్షుడుగా సిరిసేటి రమేష్ ను నియమించామని తెలిపారు,మాజీ అధ్యక్షుడు బిఎన్నార్ కేస్ పేరు మీద జిల్లా అధ్యక్షునిగా చలామణి అయితే సహించబోమని అలాంటి వారిపై తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు,అలాగే శానగొండ గ్రామానికి చెందిన మోటం సారయ్య ను రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మరియు జీలకుంట కు చెందిన వేముల రమేష్ ను జిల్లా ఉపాధ్యక్షులుగా, శానకొండ గ్రామానికి చెందిన గుంటి రవీందర్ ను ఓదెల మండల అధ్యక్షులుగా నియమించడం జరిగింది,ఈ కార్యక్రమం లో ఓదెల మండలం లోని గ్రామాల అధ్యక్షులు మరియు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలుకు అదనపు భద్రత

**టీ మీడియా, సెప్టెంబర్ 11, విజయవాడ:**




ఏపీ ప్రభుత్వ అదనపు అడ్వొకేట్ జనరల్(ఏఏజీ) పొన్నవోలు సుధాకర్ రెడ్డికి భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుధాకర్ రెడ్డికి భద్రత పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. 4o4 గన్‌మెన్లతో ఆయన భద్రత కల్పించనున్నట్టుగా ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా, ఏఏజీ సుధాకర్ రెడ్డి.. స్కిల్ డెవలప్‌మెంట్ కోసులో చంద్రబాబు అరెస్ట్ వ్యవహారంలో సీఐడీ తరఫున వాదనలు వినిపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన భద్రత కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

## పరిటాల సునీత, శ్రీరామ్‌ల అరెస్ట్

- ఉద్రిక్త పరిస్థితులు

**టీ మీడియా, సెప్టెంబర్ 11,అనంతపురం :**




చంద్రబాబు అరెస్ట్‌కు వ్యతిరేకంగా టిడిపి బంద్ పిలుపు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. టీడీపీ హైకమాండ్ పిలుపులో భాగంగా అనంతపురం జిల్లా వెంకటాపురంలో మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరంలో పరిటాల శ్రీరామ్‌లు ఆందోళనలకు పిలుపునిచ్చారు. సోమవారం తెల్లవారు జామున నాలుగు గంటలకే పరిటాల సునీత నివాసానికి పోలీసులు చేరుకున్నారు. ఆమెను హౌస్ అరెస్ట్ చేశారు. పరిటాల సునీత పోలీసుల నిర్బంధాన్ని దాటుకుని బయటకు వచ్చారు. చంద్రబాబు అరెస్ట్‌కు వ్యతిరేకంగా నిరసనకు దిగారు. సీఎం వైఎస్ జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు మాజీమంత్రి పరిటాల సునీతను అదుపులోకి తీసుకుని రామగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు ధర్మవరంలో పరిటాల శ్రీరామ్.. ఎన్టీఆర్ విగ్రహం వద్దకు పరిటాల శ్రీరామ్ చేరుకున్నారు. దీంతో పరిటాల శ్రీరామ్ వద్దకు భారీగా పోలీసులు చేరుకున్నారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో పోలీసులకు, టీడీపీ నేతల మధ్య తోపులాట జరిగింది. పలువురు కార్యకర్తలపై పోలీసులు లాఠీ చార్జ్ సైతం చేశారు. అనంతరం టీడీపీ నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు ధర్మవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## గద్దర్ అన్న యాదిలో సంస్మరణ సభ

**ఓయూ జేఏసీ నాయకులు మధు**

**టీ మీడియా ,సెప్టెంబర్ 11 ,నడిగూడెం :**



అక్టోబర్ 1న కోదాడ బాలురు ఉన్నత పాఠశాలలో జరిగే గద్దర్ అన్న యాదిలో సంస్మరణ సభకు యువత కదం తొక్కాలని ఓయూ జేఏసీ నాయకులు కందుల మధు పిలుపునిచ్చారు. సోమ వారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో ఆయన మాట్లాడుతూ తెలంగాణ కోసం తొలి దశ నుండి మలిదశ వరకు జీవితాలను త్యాగం చేసిన ఉద్యమకారుల కుటుంబాలకు సంక్షేమ పథకాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమకారులను గుర్తించిన రాజకీయ పక్షాలకే భవిష్యత్తులో తమ మద్దతు ఉంటుందని వెల్లడించారు. ప్రజా సంఘాలు ఉద్యమ కారులను గుర్తించే రాజకీయ పక్షాలుకోదాడ లో జరగబోయే గద్దర్ అన్నయ్య యాదిలో సభ లో భాగస్వాములు కావాలన్నారు.అమరుడైన నడిగూడెం విద్యార్థి నాయకుడు కనకరాజు తెలంగాణ ఉద్యమంలో తమతో కలసి పోరాటం చేసాడని అయన పోరాటానికి చిహ్నంగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలియజేసారు. విలేకరుల సమావేశంలో ఓయూ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, మండల కో ఆర్డినేటర్లు మీర్జా మోసిన్ బేగ్,మురళి, వినోద్,రవినాయక్, వీరబాబు, నవీన్, గోపి, సాయిగోపి, క్రాంతి కుమార్, సాయి పలువురు ఉద్యమ నాయకులు, పాల్గొన్నారు.



## కామాఖ్య అమ్మవారిని దర్శించుకున్న కల్వకుంట్ల కవిత

**టి మీడియా ,సెప్టెంబర్ 11, గువహటి :**

అసోంలోని గువహటిలో ఉన్న కామాఖ్య అసోంలోని గువహటిలో ఉన్న కామాఖ్య అమ్మవారిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న కవితకు అర్చకులు ఘన స్వాగతం పలికారు. కామాఖ్య ఆలయంలో కవిత ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ, దేశ ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించానని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీని తెలంగాణ ప్రజలు ఆశీర్వదిస్తారని, సీఎం కేసీఆర్‌ని మరోసారి భారీ మెజారిటీతో ప్రజలు గెలిపిస్తారని స్పష్టం చేశారు.నాలుగైదు సంవత్సరాల క్రితం ఒకసారి అమ్మవారిని దర్శించుకున్నానని, తాజాగా కామాఖ్య దేవిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆధ్యాత్మికతలో భారతదేశం విరజిల్లుతోంది. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో ప్రత్యేకత ఉందని, ఈశాన్య రాష్ట్రాల్లో ముఖ్యమైన అసోంలో ఉన్న కామాఖ్య దేవిని దర్శించుకునే భాగ్యం తనకు కలగడం సంతోషంగా ఉందని చెప్పారు.

## ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు

- నెక్కొండ సమీపంలోఘటన

**టీ మీడియా, సెప్టెంబర్ 11,వరంగల్:**



హైదరాబాద్ నుంచి విజయవాడ మీదుగా హౌరా వెళ్తున్న ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు వచ్చాయి. వరంగల్ జిల్లా నెక్కొండ సమీపంలో సోమవారం ఉదయం 12 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. రైలులో పొగలు రావటాన్ని గమనించిన ప్రయాణికులు.. చెయిన్ లాగి రైలును ఆపారు. పెద్ద ఎత్తున పొగలు వ్యాపించడంతో భయందోళన చెందిన ట్రైన్ దిగి పరుగులు పెట్టారు. హౌరా ఎక్స్ప్రెస్ లో పొగలు రావడం వారం వ్యవధిలో ఇది రెండోసారి. నాలుగు రోజుల క్రితం కొరివి మండలం గుండ్రాతిమడుగు వద్ద కూడా రైలుతో పొగలు వ్యాపించాయి. కాగా బ్రేక్ లైనర్‌లు పట్టుకోవడంతో పొగలు వచ్చినట్లు రైల్వే అధికారులు భావిస్తున్నారు.

## అంగన్వాడీల నిరవధిక సమ్మె

**టీ మీడియా, సెప్టెంబర్ 11, జన్నారం:**




మండలంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు మండల అంగన్వాడి ఉద్యోగులు సోమవారం వారి డిమాండ్స్ పరిష్కరించాలని నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26,000 చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాటివిటీ చెల్లించాలన్నారు. అంతేకాకుండా వేతనంలో సగం పెన్షన్ నిర్ణయించి 60 సంవత్సరాలు దాటి నా అంగన్వాడీ ఉద్యోగులు వాలంటరీ రిటైర్మెంట్ కొరితే బెనిఫిట్స్ కల్పించాలని ,ప్రమాద బీమా ఐదు లక్షలు చెల్లించాలని తగు డిమాండ్స్ పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె ప ప్రారంభించామని తెలిపారు. ఈ సందర్భంగా తమ డిమాండ్స్ ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. మండల అంగన్వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

**టీ మీడియా, సెప్టెంబర్ 11, జన్నారం:**



మండల కేంద్రంలోని పొనకల్ గ్రామంలో గల శ్రీ పట్టాభి కోదండ రామాలయంలో ఆదివారం రోజున రాత్రి సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. మండల ఇంటింటి హనుమాన్ చాలీసా పారాయణ బందం ఆధ్వర్యంలో దేశవ్యాప్త సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంలో భాగంగా ఆదివారం రాత్రి 21వ సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ చాలీసా బందం గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.